సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 9 । అక్టోబర్ । 2025



ఖాళీ చెక్కుతో కాసుల బేరం

సమాజంలో పరువుగా బతికే ఉద్యోగులు భయపడిపోతున్నారు. వడ్డీ వ్యాపారుల వలలో చిక్కి లబోదిబోమంటున్నారు. ఏమి చేయాలో తోచక అవస్థలు పడుతున్నారు. - 8లో



దాడులు చేస్తే.. విధులు నిర్వర్తించేదెలా?

దాడులు చేస్తే విధులు ఎలా నిర్వర్తిస్తామంటూ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0 /22.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 22.4 – 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

కోసినా.. కోయకున్నా... కన్నీరే!

చేతికొచ్చిన పంటను కోత కోయలేరు..
కోసి మార్కెట్‌కు తరలిస్తే కొనేవారే లేరు..
'మద్దతు' పలకాల్సిన పాలకులకా
కర్షకుడి కష్టమే పట్టడం లేదు.
నోటి మాటలు.. వట్టి 'కోత'లు తప్ప!
ఇంకేముంది..
కంటికి రెప్పలా కాపాడుకున్న పంటంతా
కళ్లముందే కుళ్లిపోతోంది.
ఇంటిల్లిపాది పడ్డ కష్టమంతా
పొలం ముంగిట్లోనే బూడిదైపోతోంది!
'ఉల్లి' కోయకుండానే కంట
కన్నీరు పెట్టిస్తోంది.
రైతన్న ఆశంతా చేలోనే ఆవిరైపోతోంది!!

- గిట్టుబాటు ధర లేక ఉల్లి రైతు కుదేలు
- క్వింటాల్ రూ. 400 – 500కు పడిపోయిన ధర
- పంటను పొలాల్లోనే వదిలేస్తున్న కర్షకులు



మైదుకూరులోని గొల్లపల్లె వద్ద పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

మైదుకూరు : జిల్లాలో ఉల్లి (పెద్ద బళ్లారి) పంటను సాగుచేసిన రైతులు కుదేలయ్యారు. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులను గోరు చుట్టుపై రోకటి పోటులా వర్షాలు చుట్టుముట్టి దిక్కుతోచని స్థితిలో పడేశాయి. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు, వీరపునాయునిపల్లె, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట, చాపాడు, పులివెందుల తదితర మండలాల్లో 16,668 ఎకరాల్లో రైతులు ఉల్లి పంటను సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ఉల్లి ధర అమాంతం పడిపోవడంతో రైతుల ఆశలు నేలపాలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాల్ ధర రూ. 400 – 500 మాత్రమే పలుకుతోంది. ఎకరాకు రూ. లక్ష పెట్టుబడి పెట్టిన రైతులు క్వింటాల్ ధర పాతాళానికి పడిపోవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఆఖరికి పంట కోత కోసి విక్రయించడానికి అయ్యే ఖర్చులు కూడా రాకపోవడంతో చాలామంది రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. వీరపునాయునిపల్లె మండలంలో వర్షాలకు పంట మునిగిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మైదుకూరు, దువ్వూరు మండలాల్లో పొలాల్లోనే వదిలేసిన ఉల్లి పంటను గొర్రెలు మేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

రైతుల కష్టాలపై స్పందించని కూటమి ప్రభుత్వం

గిట్టుబాటు ధర లేక కుదేలైన ఉల్లి రైతుల కష్టాలపై కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంపై కర్షకులు కన్నెర్ర చేస్తున్నారు. రైతుల నుంచి క్వింటాల్ రూ.1200 తో కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన అధికారులు ఆచరణలోకొచ్చేసరికి చేతులెత్తేశారు. ఇంతవరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసే లేదు. గిట్టుబాటు ధర లేకపోవడం, వర్షాలతో పంట దెబ్బ తినడంతో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు హెక్టారుకు రూ.50 వేలు పరిహారం చెల్లిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అది కేవలం కర్నూలు జిల్లాకు మాత్రమే వర్తిస్తుందని తెలియడంతో జిల్లా రైతులు ఆవేదన చెందుతున్నారు. అటు గిట్టుబాటు ధర లేక ఇటు వర్షాలతో పంట దెబ్బ తిని తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ఉల్లి రైతులు కోరుతున్నారు.



గిట్టుబాటు ధర లేక రైతులు పారబోసిన పంటను మేస్తున్న జీవాలు



వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంట

తీవ్రంగా నష్టపోయాను



నేను 5 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశాను. వర్షంతో పంటంతా దెబ్బతింది. ఎకరాకు రూ.లక్ష ఖర్చయింది. పంట చేతికి వచ్చే సమయంలో రోజూ వాన కురుస్తూ పంట నాశనమైంది. తీవ్రంగా నష్టపోయాను ప్రభుత్వమే ఆదుకోవాలి.
– దండు మునెయ్య,రైతు, గొల్లపల్లె, మైదుకూరు.

ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం



ఎంతో ఆశతో పంటను సాగు చేసిన ఉల్లి రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారు. కొందరు చేలల్లోనే పంటను వదిలేశారు. రైతులకు యూరియా కూడా సక్రమంగా పంపిణీ చేయని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి ఆదుకోవాలి. లేదంటే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తాం.
– శెట్టిపల్లె రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

చేతి కందిన పంట నాశనమైంది



నేను రెండున్నర ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశాను .పంట సాగుకు రూ. 2 లక్షలు పెట్టుబడి అయింది. గడ్డలు బాగా ఊరాయి. మంచి ధర వస్తే కష్టానికి తగిన ఫలితం వస్తుందని ఆశపడ్డాను. తీరా పంట పీకిన తర్వాత జోరున వర్షం పడింది. గడ్డలన్నీ తడిసిపోయాయి. దాంతో పొలంలోనే వదిలేశాను.
– అనకల చిన్న వెంకటరెడ్డి, రైతు, ఓబులాపురం, మైదుకూరు

ఉల్లి రైతులను ఆదుకోవాలి

వీరపునాయునిపల్లె : ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వీఎన్ పల్లె మండలంలోని ఉల్లి పంట సాగు చేసిన రైతులతో మాట్లాడారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోవడం బాధాకరమన్నారు. పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడంతో భారీగా నష్టపోతున్నారని అటువంటి సమయంలో మద్దతు ధర ప్రకటించడంతో పాటు సొంతంగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా చూస్తూ ఊరుకోవడం దారుణమని ధ్వజమెత్తారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ రూ.12వందలతో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకు కొనుగోలు ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరటి, చీని, బొప్పాయి, ఉల్లి లాంటి అన్ని పంటలకు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వర్షాలు అధికంగా కురిసి ఉల్లి పంట దెబ్బతిన్న విషయం తెలుసుకొని కేవలం 20రోజుల్లోనే పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయిందన్నారు. తక్షణమే ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధరతో కొనుగోలు చేయడమా లేక హెక్టారుకు 50వేల రూపాయలు అందించాలని డిమాండు చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. గురువారం 10గంటలకు రైతులతో వెళ్లి కలెక్టర్‌ను కలుస్తామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేస్తామని వివరించారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టకపోతే కలెక్టరేట్‌ను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, జిల్లా రైతు నాయకుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ రైతు నాయకుడు భాస్కర్ రెడ్డి, కమలాపురం మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రాజు పాలెం జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచులు వెంకటరెడ్డి, నరేష్‌రెడ్డి, సౌజన్యరెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, రవి, సుధాకర్‌రెడ్డి, శివాంజనేయరెడ్డి, వీరయ్యాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి

న్యూస్‌రీల్

జిల్లాకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్



రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌కు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ బాధ్యతలు స్వీకరించాక తొలిసారి జిల్లాకు వచ్చారు. బుధవారం కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఉన్న ఆయన్ను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మర్యాదపూర్వకంగా కలసి మొక్క బహూకరించారు. అంతకుముందు ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ కు చేరుకోగా జిల్లా అధికారులు, స్థానిక నేతలు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పలువురు ఎమ్మార్పీఎస్, వీహెచ్పీఎస్, ఎస్సీ నాయకులతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డీఎస్పీలు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

వైవీయూ వీసీగా ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండ



కడప కోటిరెడ్డిసర్కిల్ : యోగి వేమన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ రాజశేఖర్ బెల్లంకొండను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాదు యూనివర్శిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈయన మూడేళ్లపాటు వీసీగా కొనసాగనున్నారు.

ఏఎఫ్‌యూ వీసీగా జయరామిరెడ్డి నియామకం



కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా బి. జయరామిరెడ్డిని గవర్నర్ అబ్దుల్ నజీర్ నియమించారు. ప్రస్తుతం ఇన్‌చార్జుగా వీసీగా విశ్వనాథ్‌కుమార్ పనిచేస్తున్నారు. కాగా జయరామిరెడ్డి ప్రొద్దుటూరు వైవీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. నేడో,రేపో ఆయన వీసీగా బాధ్యతలను స్వీకరించనున్నారు.

పులివెందుల పోలీసా.. మజాకా!

- పరామర్శకు వెళితే కేసులా?
- విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి పులివెందుల ఖాకీల తీరు రోజు రోజుకు తీవ్ర వివాదాస్పదమవుతూనే ఉంది. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించిన పులివెందుల పోలీసులు.. మరికొంతమంది నేతలపై రౌడీ షీట్లు కూడా నమోదు చేశారు. తాజాగా జరిగిన ఓ ఘటనలోనూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం పోలీసుల ఏకపక్షవైఖరికి అద్దం పడుతోంది. గత ఆదివారం రాత్రి పట్టణంలోని నగరిగుట్టలో వ్యక్తిగత కక్షల కారణంగా రాజేష్, అంజనప్పల వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. గొడవ అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ కిశోర్ అంజనప్పతో పాటు మరికొందరిని పరామర్శించారు. గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కొందరు టీడీపీ నాయకులు కూడా ఆ ఘటనలో గాయాలపాలైన కొందరిని పరామర్శించారు. 'నవ్విపోదురు గాక.. నాకేటి సిగ్గు' అన్నట్లు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఏకపక్ష ధోరణిలో అంజనప్పతో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించారు. అంతేనా.. పరామర్శకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులపై సైతం గొడవకు కుట్రదారులుగా పేర్కొంటూ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ కిశోర్‌లపై అటెంప్ట్ టు మర్డర్ కేసు నమోదు చేసినట్లు సమాచారం. అటువైపు పరామర్శకు వెళ్లిన టీడీపీ నాయకులపై ఎటువంటి కేసులు నమోదు చేయలేదు. పులివెందుల పోలీసుల వైఖరి చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులను సంతృప్తి పరిచేందుకే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

వారంతా పీహెచ్‌డీలో ప్రవేశాలకు అర్హులే

కడప ఎడ్యుకేషన్ : యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) అర్హత సాధించిన వారికి యోగి వేమన విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశానికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. యూజీసీ నెట్ ఫెలోషిప్, లెక్చరర్‌షిప్, పీహెచ్డీ క్వాలిఫై అయిన అభ్యర్థులు yvu.edu.inను సందర్శించి దరఖాస్తును డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తును ఈనెల 15లోపు విశ్వవిద్యాలయంలో అందజేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో లభించే ఖాళీలను అనుసరించి ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు. వివరాలకు 83175 32040ను సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

– కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో దీర్ఘకాలికంగా రెవెన్యూ డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జేసీ అదితి సింగ్ తో కలసి ఫిర్యాదులను పునఃపరిశీలన చేశారు. ఆర్డీఓలు వారిపరిధిలో గల మండలాల వారీగా అధికారులు, రికార్డులతో సహా హాజరయ్యారు.

ప్రజా ఫిర్యాదులలో రెవెన్యూ, భూ సమస్యలు, కోర్టు వ్యవహారాలు, కుటుంబ భాగ పరిష్కారాలు తదితర అంశాలకు సంబంధించిన అందిన అర్జీలపై ఫిర్యాదు దారులతో నేరుగా మాట్లాడి పలు సూచనలు, సలహాలు అందించారు. దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ కుటుంబ తగాదాల నేపథ్యంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అర్జీదారులకు తగు సూచనలు చేశారు. ఈ ప్రత్యేక ఫిర్యాదుల కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు,కడప,జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, సర్వే ల్యాండ్స్ ఏడీ మురళీ కృష్ణ,అన్ని మండలాల తహశీల్దార్లు, ఆర్ఐ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కడప 'దేశం'లో కల్లోలం!

- ఇటీవల నియమించిన నగర కమిటీపై తమ్ముళ్ల ఆగ్రహం
- కార్యకర్తల అసంతృప్తిపై అధిష్ఠానం ఆరా
- మరోమారు అభిప్రాయ సేకరణ



కడప రూరల్ : జిల్లా తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న పరిణామాలు ఒకెత్తయితే.. కడప నియోజకవర్గంలో జరుగుతున్న సంఘటనలు అంతకుమించి ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కడపలో జరిగే పార్టీ వ్యవహారాలు.. ఆధిపత్య గొడవలు ఆ పార్టీ అధిష్ఠానాన్నే కలవరపెట్టే స్థాయికి చేరాయి. తాజాగా కడప నగర కమిటీ నియామకం ఆ పార్టీలో చిచ్చు రేపింది. ఇటీవల కడప నగర అధ్యక్షుడిగా పఠాన్ మన్సూర్ అలీఖాన్‌తోపాటు ఇతర సభ్యుల నియామకానికి చర్యలు చేపట్టారు. ఆ మేరకు అభిప్రాయ సేకరణ తీసుకున్నారు. అప్రూవ్, రిజెక్ట్ అనే ఆప్షన్స్ ద్వారా కార్యకర్తల నిర్ణయాలను సేకరించారు. ఈ సందర్భంగా దాదాపు 70 శాతానికి పైగా కార్యకర్తలు రిజెక్ట్ ఆప్షన్‌ను ఎంచుకున్నట్లుగా ప్రచారం సాగింది. ఈ అంశాన్ని ఆ పార్టీకి చెందిన తమ్ముళ్లు బహిరంగంగానే అధికార పార్టీకి చెందిన గ్రూపుల ద్వారా తెలియపరిచారు. తర్వాత ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసులురెడ్డి, కడప నగర అధ్యక్షుడిగా పఠాన్ మన్సూర్ అలీఖాన్‌తోపాటు ఇతర కార్యవర్గాన్ని నియమిస్తూ నూతన కమిటీని ప్రకటించారు. ఈ జాబితాపై పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తాము రిజెక్ట్ చేసిన అభ్యర్థులనే టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఆమోదింపజేశారని మండిపడ్డారు. ఈ నగర కమిటీకి పార్టీ అధిష్ఠానం అనుమతి లేదని తేల్చి చెప్పారు. ఈ కమిటీపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ పార్టీ కార్యకర్తలు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేశారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన నూతన కమిటీలో సీనియర్ కార్యకర్తలు ఎవరూ లేరంటూ ఆరోపించారు.

మళ్లీ అభిప్రాయ సేకరణపై 'రిజెక్ట్' ఎఫెక్ట్..?

ఈ తరుణంలో బుధవారం ఆ కమిటీని రద్దు చేస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లుగా ఆ పార్టీకి చెందిన తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ అంశాన్ని టీడీపీకి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో పంచుకున్నారు. అదే సందర్భంలో పార్టీ అధిష్ఠానం రద్దు చేసిన కమిటీలో ఉన్న వ్యక్తుల పేర్లనే సూచిస్తూ మరోమారు అభిప్రాయ సేకరణ కోరింది. ఇప్పుడు కూడా ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు, జాబితాలోని సభ్యులను వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశం తాజాగా కడప తెలుగుదేశం పార్టీలో సంచలనంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆటలు అధిష్ఠానం వద్ద సాగడం లేదు. అందువల్లే కమిటీని రద్దుచేసి మళ్లీ అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లుగా తమ్ముళ్లు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న అంశాలు పార్టీలో సంచలనంగా మారాయి.

టెట్.. టెన్షన్!



పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- టీచర్లకు కలవరపెడుతున్న సుప్రీంకోర్టు తీర్పు
- రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే పదోన్నతులు కరువే!
- సీనియర్ ఉపాధ్యాయుల్లో ఆందోళన
- తీర్పుపై పునరాలోచించాలంటున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : పిల్లలకు పాఠాలు బోధించి పరీక్షలు నిర్వహించే గురువులకే ఇప్పుడు పరీక్ష పాస్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులంతా తాజాగా టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) రాయాల్సిందేనని తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పైగా రెండేళ్లలోపు పాస్ కావాల్సిందేనని నిబంధనతో గురువులు ఆందోళన చెందుతున్నారు. సీనియర్ టీచర్స్‌లో కలవరం మరింత ఎక్కువైంది.

సంస్కరణల పేరుతో....

అసలే విద్యారంగంలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రాష్ట్రంలో లేని విధంగా 1 నుంచి 10వ తరగతి వరకు 9 రకాల బడులను తీసుకొచ్చింది. ఇప్పటికే పలు రకాల యాప్‌లతో టీచర్లకు మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. ఇది చాలదన్నట్లు ఇప్పుడు టీచర్ ఎలిజిబులిటీ టెస్టు(టెట్) పాస్ కావాల్సిందేనని ఉపాధ్యాయులపై సుప్రీంకోర్టు గుదిబండ పెట్టింది. 2010కి ముందు ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు ఇప్పుడు టెట్ తప్పని సరిగా రాసి అర్హత సాధించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో వారిలో ఆందోళన మొదలైంది. ఏళ్లుగా విద్యార్థులకు బోధిస్తున్నా తమకు ఇప్పుడు టీచర్ ఎలిటిబులిటి టెస్టు నిర్వహించడం ఏమిటంటూ ఉపాధ్యాయులు, సంఘ నాయకులు వాపోతున్నారు.

పదోన్నతులతో లింక్.... సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఐదేళ్లకు పైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ రాసి ఉత్తీర్ణత కావాలి. కాకపోతే ఉద్యోగం వదులుకోవాల్సిన పరిస్థితి వస్తుందేమోనని అయ్యవార్లను టెన్షన్ వెంటాడుతోంది. దీనికితోడు టెట్ పాస్ కాని వారికి పదోన్నతులతోపాటు నియామకాలు కూడా ఉండవని కోర్టు తీర్పులో పేర్కొంది. ఐదేళ్లలోపు సర్వీస్ మిగిలి ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చినప్పటికీ వారికి పదోన్నతులు కావాలంటే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. 2010 విద్యాహక్కుచట్టం అమలులోకి వచ్చిన తర్వాత టెట్ తప్పనిసరిగా పాస్ కావాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో 2010 తర్వాత వచ్చిన వారంతా టెట్ పాసైన వారే.

కఠిన పరీక్షే... టెట్ పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీ కేటగిరి వారు 60 శాతం, బీసీ కేటగిరి 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్‌సీ, ఎక్స్ సర్వీస్ మెన్ కేటగిరి వారు 40 శాతం మార్కులు సాధించాలి. టెట్ పాస్ కావాలంటే తెలుగు, ఇంగ్లీష గణితం, చైల్డ్ డెవలప్‌మెంట్, పర్యావరణానికి సంబంధించిన అంశాలన్నీ చదవాల్సి ఉంటుంది, బయలాజికల్ సైన్సు ఉపాధ్యాయులకు గణితం, తెలుగు పండితులకు సోషల్ స్టడీస్ ఇలా సంబంధం లేని సబ్జెక్టులు టెట్‌లో పెట్టి పాస్ కావాలంటే ఎలా అని టీచర్లు వాపోతున్నారు.

ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి



సుప్రీం తీర్పు నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి రివ్యూ పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యాశాఖ ఒక ప్రకటన చేయాలి. విద్యాహక్కు 2010 నుంచి అమలైన దృష్ట్యా అంతకుముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ మినహాయింపునివ్వాలి.– మల్లు రఘునాథ రెడ్డి ఎస్టీయూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అనుభవమే అర్హత



విద్యారంగంలో అనుభవమే గొప్ప అర్హత. సీనియర్ టీచర్ల బోధనా నైపుణ్యాలను టెట్ పరీక్షతో కొలవలేం. సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించాలి. సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లను దాఖలు చేయాలి.
– సజ్జల రమణారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

తీర్పును సమీక్షించాలి



ఐదేళ్ల తర్వాత ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులందరూ సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం సమీక్షించాలి. టెట్ అర్హత పరీక్ష ఉత్తీర్ణత కాకుంటే ఉద్యోగం నుండి రిటైర్ కావాలని, ఐదేళ్ల లోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు కూడా ప్రమోషన్ కావాలంటే టెట్ పాస్ కావాల్సిందేనంటూ సెప్టెంబర్ 1వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్సీటీఈ, ఏపీ ప్రభుత్వం కూడా వీలైనంత త్వరగా రివ్యూ పిటిషన్లు వేయాలి.
– బి. లక్ష్మి రాజా, యూటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


నూర్జహాన్

చాపాడు : మండల కేంద్రమైన చాపాడుకు చెందిన అల్లగుర్తి నూర్జహాన్(55) వాషింగ్ మిషన్ ప్లగ్ తీస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందారు. కుటుంబీకులు, గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహమ్మద్‌గౌస్ భార్య నూర్జహాన్ బుధవారం ఉదయం ఇంటి వద్ద వాషింగ్ మిషన్‌లో దుస్తులు వేసింది. అనంతరం విద్యుత్ ప్లస్‌బాక్స్ నుంచి వాషింగ్ మిషన్ ప్లగ్ బయటికి తీస్తూ ప్రమాదవశాత్తూ షాక్‌కు గురైంది. కింద పడిపోయిన నూర్జహాన్‌ను కుటుంబీకులు గుర్తించి 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి


ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 65 ఏళ్లు ఉంటాయని, అతను రైల్వే స్టేషన్‌లోనే భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేవాడని స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

నిబంధనలకు లోబడి పనిచేయాలి

కడప అగ్రికల్చర్ : సహకార చట్టం నిబంధనలకు లోబడి నూతన పాలకులు పనిచేయాలని జిల్లా కో ఆపరేటివ్ ఆధికారి వెంకటసుబ్బయ్య సూచించారు. కడప డీసీసీ బ్యాంకులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సహకార పరపతి సంఘం అధ్యక్షుల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. సహకార సంఘాల బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సహకారం సంఘ అధ్యక్షుడు కష్టపడి సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రాజామణి, సత్యానంద్, గోపీకృష్ణ, పాల్గొన్నారు.

ఖాళీ చెక్కుతో కాసుల బేరం

- వడ్డీ వ్యాపారి దెబ్బకు ప్రభుత్వ ఉద్యోగులు విలవిల
- గుర్రప్ప స్వామి ఆటో ఫైనాన్స్ పేరుతో వ్యాపారం
- 300కు పైగా కేసులు వేసిన జింకా రవి, ఆయన అనుచరులు


ఖాళీ చెక్కులో రూ.10లక్షలు బాకీ ఉన్నట్లు రాసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : సమాజంలో పరువుగా బతికే ఉద్యోగులు భయపడిపోతున్నారు. వడ్డీ వ్యాపారుల వలలో చిక్కి లబోదిబోమంటున్నారు. ఏమి చేయాలో తోచక తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పలేని పరిస్థితి. 2016 నుంచి కొంత మంది అనుచరులను మధ్యవర్తులుగా ఏర్పాటు చేసుకున్న ఓ వ్యాపారి దాష్టీకం ఇది. లక్ష రూపాయలు వడ్డీకి ఇచ్చి ఖాళీ చెక్కులు తీసుకోవడం.. మొత్తం చెల్లించినా.. తర్వాత ఎక్కువ మొత్తం చెక్కులో రాసి కోర్టు ద్వారా అధికంగా సొమ్ము లాక్కోవడం అతడికి ఆనవాయితీగా మారింది. బయటికి చెప్పుకోలేకపోతున్నామన్న ఉపాధ్యాయులు సాక్షితో స్వయంగా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లెకు చెందిన జింకా రవి గతంలో శిల్క్ వ్యాపారం చేసేవారు. నష్టాలు వచ్చాయని రూ.40 లక్షలకు 99/2003లో ఐపీ కేసు నమోదైంది. కోర్టు ద్వారా వేలంలో జింకా రవి ఇంటిని కూడా వేరొకరు కొన్నారు. ఈయనే 2016లో గుర్రప్ప స్వామి ఆటో ఫైనాన్స్ పేరుతో వడ్డీ వ్యాపారం ప్రారంభించాడు. పేరుకు మాత్రమే సంస్థ ఏర్పాటుచేశారు కానీ ఎలాంటి రికార్డులు మెయింటెనెన్స్ చేయడం, ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులనే టార్గెట్‌గా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నాడు. తీసుకున్న అప్పు కంతుల ప్రకారం చెల్లించినా తన వద్ద ఉన్న ఖాళీ చెక్కులను కోర్టులో వేసి రూ.లక్షకు రూ.10 లక్షలు బాకీ ఉన్నట్లు తన ఇష్టం వచ్చినట్లు ఖాళీ చెక్‌లో రాసుకుని బాకీదారులపై ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాడు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తూ పదవీ విరమణ చెందిన దంపతులు గుర్రప్ప స్వామి ఆటో ఫైనాన్స్‌లో అప్పు తీసుకున్నారు. రూ.లక్షల్లో బాకీ ఉన్నారని వారిపై 15 తప్పుడు కేసులు పెట్టి వేధించారనే ఆరోపణ ఉన్నాయి. ప్రొద్దుటూరు ఒకటో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో జింకా రవి, ఆయన అనుచరులు వేసిన కేసులు 300కు పైగానే ఉన్నాయనే ఆరోపణలున్నాయి.

రూ.1.50 లక్షలు తీసుకుంటే రూ.36 లక్షలంటూ కోర్టుకు

ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీలో నివసిస్తున్న వితంతురాలైన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రూ.50 వేలు ఒక మారు, రూ.లక్ష మరో మారు వడ్డీకి తీసుకున్నారు. ఆమె రూ.3 లక్షలు చెల్లించారు. డబ్బు తీసుకున్న సమయంలో ఉపాధ్యాయురాలు ఇచ్చిన ఖాళీ చెక్కులను ఆధారంగా చేసుకుని రూ.36 లక్షలు బాకీ ఉన్నట్లు కోర్టులో వేశాడు. తన కుమారుడు తిరుపతిలో ట్యాక్సీ నడుపుతుండటంతో అవసరాల కోసం ఆమె అప్పు తీసుకోవడం జరిగింది. గుర్రప్ప ఆటో ఫైనాన్స్ ఎండీ జింకా రవితోపాటు ఆయన అనుచరులు మొత్తం 7 కేసులు వేయగా 4 కేసులు కొట్టేశారు. మిగతా కేసులు విచారణలో ఉండగానే ఆమె చనిపోవడం జరిగింది.

రూ.5 లక్షలకు.. రూ.20లక్షలట..

ప్రొద్దుటూరుకు చెందిన ఓ ఉపాధ్యాయుడు రూ.లక్ష అప్పు తీసుకుని రూ.5 లక్షలు చెల్లించాడు. ఇంకా బాకీ ఉందని ఒత్తిడి చేయడంతో ఆ ఉపాధ్యాయుడు పక్కనున్న మండలానికి బదిలీ చేయించుకున్నారు. ఆయనపై రూ.20 లక్షలకు కోర్టులో కేసు వేశారు. 2019లో కోర్టులో కేసు విచారణ జరుగుతుండగానే తనకు వచ్చిన మెడికల్ బెనిఫిట్ రూ.5 లక్షలు తనకంటే ముందుగానే బ్యాంక్ ద్వారా డ్రా చేసుకున్నాడు. ఈయనపై పెట్టిన రెండు కేసులను కోర్టులో కొట్టివేయడం జరిగింది.

ఖాళీ చెక్కులపై అదనంగా రాసుకుని..

మరో ప్రభుత్వ ఉపాధ్యాయుడు యనమల సుబ్బరాయుడు గుర్రప్ప ఆటో ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకుని చెల్లించినా.. ఖాళీ చెక్కులను కోర్టులో వేసి తనకు ఇంకా బాకీ ఉందని కేసులు వేశారు. జింకా రవితోపాటు ఆయన అనుచరులు మొత్తం 7 కేసులు వేశారు. ఇందులో రెండు కేసులు కొట్టివేయగా, ఐదు కేసులు విచారణలో ఉండగానే గుండెపోటుతో ఉపాధ్యాయుడు మరణించాడు. మరో ఉపాధ్యాయుడిపై కూడా నాలుగు కేసులు వేయడం జరిగింది. మరో ఉపాధ్యాయుడు తాను తీసుకున్న డబ్బు చెల్లించినా కోర్టులో కేసు వేయడంతో విధిలేని పరిస్థితిలో ఆయన పక్క నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. ఆయన జింకా రవిని పిలిపించి హెచ్చరించడంతో కోర్టులో కేసు విత్ డ్రా చేసుకున్నారు. దీంతో ఆ ఉపాధ్యాయుడు మానసిక వేదన అనుభించాడు.

కోర్టులో కొట్టేసినా..

కె.చంద్రశేఖర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇచ్చిన ఖాళీ చెక్కుతో రూ.9 లక్షలు చెల్లించాలని 2017 జనవరి 7వ తేదీన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గుర్రప్పస్వామి ఆటో ఫైనాన్స్ తరపున కేసు వేయగా 2019 మే 16న కొట్టేశారు. ఇదిలా ఉండగా తన వద్ద ఉన్న సదరు ఉపాధ్యాయుడి ఖాళీ చెక్కులను ఆసరాగా చేసుకుని రూ.4 లక్షలు చెల్లించాలని 2019 జూన్ 7న, జూలై 17న రూ.2.50 లక్షలకు మొదటి అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో తప్పుడు కేసులు వేయడం జరిగింది. ఓ మహిళా ఉపాధ్యాయురాలికి సంబంధించి 2019 మే 16న ఖాళీ చెక్‌తో దాఖలు చేసిన కేసును కొట్టివేయగా, 2019 మే 31న రూ.4.25 లక్షలకు మళ్లీ కేసు వేశారు. ఈ ప్రకారం గుర్రప్పస్వామి ఆటో ఫైనాన్స్ ఎండీ జింకా రవి తరపున 2017లో 35 కేసులు, 2018లో 7 కేసులు, 2019లో 17 కేసులు, 2020లో 11 కేసులు వేశారు. జింకా వెంకటసుబ్బయ్య 42 కేసులు, జింకా బ్రహ్మయ్య 26 కేసులు, గుర్రం వెంకటలక్ష్మయ్య 9 కేసులు, పుల్లగూర చౌడయ్య 30 కేసులు, వద్ది ఓబయ్య 22 కేసులు వేశారు.

ప్రభుత్వ ఉద్యోగులే టార్గెట్

వడ్డీ వ్యాపారి జింకా రవి చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేసుకున్నారు. 2016 నుంచి తక్కువ మొత్తం అప్పు ఇచ్చి ఉద్యోగులచే ఖాళీ చెక్కులను ఇప్పించుకుని తమ ఇష్టం వచ్చిన రీతిలో డబ్బు మొత్తాన్ని రాసుకుని కోర్టులో కేసు వేశారు. కోట్ల రూపాయలను అక్రమంగా పొందాలనే ప్లాన్‌తో ఇలా చేశారు. విచారణ జరిగిన కేసుల్లో 20కిపైగా కొట్టివేయడం జరిగింది. జింకా రవి వేసిన కేసుల్లో ఒకటి యదార్థంగా బాకీ ఉన్నట్లు అనిపించడం లేదు. అన్ని కేసులూ తప్పుడు కేసులే. ఒక కేసు కొట్టేశాక అదే వ్యక్తిపై మళ్లీ ఇంకొక కేసు వేశారు.

- ఎన్‌సీ సుమంత్ కుమార్, న్యాయవాది, ప్రొద్దుటూరు

హత్య కేసు నిందితుడికి జీవితఖైదు


జీవితఖైదు పడిన నిందితుడు మల్లికార్జున (పోలీసుల మధ్యలో వున్న వ్యక్తి)

కడప అర్బన్: హత్య కేసులో ఓ నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని తీర్పునిచ్చారు. సంఘటన వివారాలిలా ఉన్నాయి.. చెట్టివేలి భవాని శంకర్ కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో, మహావీర్ సర్కిల్ సమీపంలోని ఎల్ఐసీ కార్యాలయం, ఈఎండీ స్కానింగ్ సెంటర్‌లో కాంట్రాక్టర్ మల్లికార్జున వద్ద కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాడు. అయితే తన భార్యతో మృతుడికి వివాహేతర సంబంధం ఉందని మల్లికార్జున అనుమానించాడు. కోపంతో మృతుడిని తరచూ వేధించేవాడు. 2023 నవంబర్, 12న ఉదయం 9 గంటల సమయంలో మల్లికార్జున ఎల్ఐసీ ఆఫీసుకు రమ్మని భవానీ శంకర్‌ను పిలిచాడు. మృతుడు ఆఫీస్ వద్దకు వెళ్లగానే ఆగ్రహావేశంతో తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నావు'' అంటూ వెంట తెచ్చుకున్న మచ్చు కత్తితో విచక్షణా రహితంగా భవానీశంకర్‌ను నరికి చంపాడు. మృతుడి భార్య చిట్టివేలి బాబాబీ కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అప్పటి సీఐ నాగరాజు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి జీవిత ఖైదు, రూ.100 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ షెల్కేనచికేత్‌విశ్వనాథ్ అభినందించారని సీఐ బి.రామక్రిష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా బిషప్ జన్మదిన వేడుక


రక్తదాన శిబిరంలో బిషప్ ఐజాక్‌వరప్రసాద్

కడప రూరల్ : సీఎస్ఐ రెవరెండ్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రాయలసీమ డయాసిస్ మండల అధికారులు, గురువుల ఆధ్వర్యంలో స్థానిక చర్చిలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలను బిషప్ ఐజాక్ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ చర్చి యూత్ బోర్డు సెక్రటరీ మోజెస్ మాట్లాడుతూ బిషప్ ఐజాక్ వరప్రసాద్ జన్మదిన వేడుక సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. చర్చి అసిస్టెంట్ సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ పీఎస్.వినయ్‌కుమార్‌క, రెవరెండ్ సంపత్, సరోజ్‌కుమార్, డేనియల్, తదితరులు పాల్గొన్నారు

అనుమానితులకు పాలిగ్రాఫ్ టెస్ట్

జమ్మలమడుగు రూరల్ : గండికోటలో మైనర్ బాలిక హత్య కేసులో అనుమానితులైన కొండయ్య, సురేంద్ర, బాలిక స్నేహితుడు లోకేష్‌లను పాలిగ్రాఫ్ టెస్ట్ కోసం సిఐ నరేష్‌బాబు ఈ నెల 5న విజయవాడకు తీసుకెళ్లారు. గత మూడు రోజులుగా అనుమానితులకు పాలిగ్రాఫ్ పరీక్ష చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల 10వతేదీన కోర్ట్ అనుమతి ఉండడంతో హత్య కేసు చిక్కుముడి వీడనుంది.

వైఎస్.జగన్‌కు పేరొస్తుందనే కళాశాలల ప్రైవేటీకరణ


విలేకరులతో మాట్లాడుతున్న టీజేఆర్ సుధాకర్ బాబు, పాల్గొన్న నాయకులు

ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్.సుధాకర్‌బాబు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందకుండా పోతాయన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సైతం వ్యతిరేకించారని గుర్తుచేశారు. వైద్య రంగాన్ని చంద్రబాబు బినామీల చేతుల్లో పెట్టకుండా మాజీ సీఎం వైఎస్.జగన్ అడ్డుపడుతూ మహా యజ్ఞం సాగిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలో తాను కట్టిన మెడికల్ కాలేజీని ప్రజలకు చూపించడానికి వైఎస్.జగన్ వెళ్తుంటే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఛాలెంజ్ చేయడం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30రకాల సంక్షేమ పథకాలతో దళితులకు రూ.70 వేల కోట్లు లబ్ధి కలిగిందన్నారు. ప్రతి సంవత్సరం రూ.13వేల కోట్లు వారి ఖాతాల్లో పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలను సర్వనాశనం చేసిందన్నారు. సూపర్ సిక్స్‌తో దళితులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మాల, మాదిగ మహిళలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కుడి చేత్తో వడ్డించడం, ఎడం చేత్తో లాక్కోవడం చంద్రబాబు నైజమన్నారు. మద్యం కుంభకోణాన్ని సృష్టించి వైఎస్.జగన్ చుట్టూ ఉన్నవారందరినీ అరెస్ట్ చేసి జైళ్లలో పెట్టారని, ఇప్పుడు చిత్తూరు జిల్లాలోనే నకిలీ మద్యం తయారీ కేంద్రం బయటపడిందన్నారు. నకిలీ మద్యంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం నాశనం చేసేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నారని, సరసమైన ధరలకు స్వచ్ఛమైన మద్యం ఇస్తామని ఇదివరకు ఏ రాజకీయ నాయకుడు చెప్పలేదన్నారు. ఒక్క చంద్రబాబు మాత్రమే చెప్పారని ఎద్దేవా చేశారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నేతలు పులి సునీల్, ఎస్. వెంకటేశ్వర్లు, త్యాగరాజు, కె. బాబు, సుబ్బరాయుడు, సీహెచ్ వినోద్, భాస్కర్, కె. శరత్ బాబు, శ్రీనివాసులు, కంచుపాటి బాబు పాల్గొన్నారు.

లక్షమందితో జగనన్న దళిత ఫోర్స్

కడప కార్పొరేషన్: లక్ష మందితో జగనన్న దళిత ఫోర్స్ తయారు చేయాలన్నదే తన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఎస్సీ విభాగానికి సంబంధించిన నేతలతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 16వేల గ్రామాలున్నాయని, ప్రతి గ్రామం నుంచి ఐదుమంది దళితులను ఎంపికచేయాలన్నారు. కమిటీలన్నీ పూర్తయిన తర్వాత జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం, జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 13న అన్ని నియోజకవర్గాల్లో ఎస్సీ సెల్ సమావేశాలు నిర్వహించాలని, ప్రతి సమన్వయకర్త తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కమిటీలు పూర్తి చేసేందుకు తాత్కాలిక పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. కడప నియోజకవర్గానికి త్యాగరాజు, బద్వేల్‌కు కె.బాబు, ప్రొద్దుటూరుకు సీహెచ్.వినోద్‌కుమార్, కమలాపురానికి సుబ్బరాయుడు, జమ్మలమడుగుకు యోబు, మైదుకూరుకు కె.శరత్ బాబు, పులివెందులకు భాస్కర్‌లను నియమించారు. పులి సునీల్ కుమార్, సింగమాల వెంకటేశ్వర్లు, కంచుపాటిబాబు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


మృతిచెందిన హాజీవలి, రామ్మోహన్(ఫైల్)

ముద్దనూరు : ఇద్దరూ మంచి స్నేహితులు.. కలిసి భోజనం చేశారు.. మరణంలోనూ వారు స్నేహం వీడలేదు. ముద్దనూరు–కడప ప్రధాన రహదారిలో సున్నపురాళ్లపల్లె క్రాస్ వద్ద బుధవారం తెల్లవారుజామున లారీ ఢీకొని జరిగిన ప్రమాదంలో ఇద్దరూ మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. చిలంకూరుకు చెందిన హాజీవలి, సీకే.సుగాలిబిడికి గ్రామంలో నివాసముంటున్న రామ్మోహన్ ఇరువురూ మంచి స్నేహితులు. బుధవారం ఇద్దరూ కలిసి భోజనం చేయాలనుకున్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ చిలంకూరు వద్ద లారీ నిలిపి హాజీవలితో కలిసి మోటార్ బైక్‌పై ముద్దనూరులో భోజనం చేయడానికి వెళ్లారు. అనంతరం తిరిగి చిలంకూరుకు బయలుదేరారు. సున్నపురాళ్ళపల్లె క్రాస్ వద్ద వెనుకనుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో హాజీవల్లి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రామ్మోహన్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ట్రంప్ టారిఫ్ టెర్రరిజంపై మోదీ మౌనం వీడాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రొద్దుటూరు : ట్రంప్ టారిఫ్ టెర్రరిజంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మహిళా శక్తి భవనంలో బుధవారం సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్1బీ వీసా వేధింపులు, యూనివర్సిటీ యువత, మధ్యతరగతి విద్యావంతులు, ఐటీ కుటుంబాలు, టెక్స్‌టైల్స్ గార్మెంట్స్, రైతులపై పన్నుల భారం మోపి ట్రంప్ టారిఫ్ టెర్రరిజం సృష్టిస్తున్నారన్నారు. అమెరికా సామ్రాజ్య వాద వాణిజ్య వ్యతిరేక పోరాటం చేయాల్సిన ఎన్డీఏ ప్రభుత్వం మౌనం వహించడం దేశానికి ప్రమాద కరమన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి రాజ్యాంగంపై దాడిగా పరిగణించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక దోపిడీ కుల వ్యవస్థ రూపంలో ఉందని, దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. అధికార, ప్రతిపక్షాలు జిల్లా సమగ్రాభివృద్ధిని పూర్తిగా విస్మరించారయని, ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, పులివెందుల మెడికల్ కళాశాల ప్రారంభం, మేజర్, మైనర్, స్మాల్, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, అసంపూర్తిగా ఉన్న కడప-బెంగళూరు రైల్వే లైన్ నిర్మాణం పూర్తిచేయాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలలో ఉపాధి అవకాశాలను పెంచాలన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై అదనపు భారం మోపడం తగదన్నారు. యూరియా కొరత పరిష్కరించాలని, బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. ఎ.రామ్మోహన్, సత్యనారాయణ, సర్వేశ్వరి, ముంతాజ్ బేగం, సాల్మన్, విజయ్‌కుమార్, మహబూబ్ బాషా, రమేష్, పాల్గొన్నారు.

దాడులు చేస్తే.. విధులు నిర్వర్తించేదెలా?


ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు

విధులు బహిష్కరించి అద్దె బస్సు డ్రైవర్ల నిరసన బాట

కడప కోటిరెడ్డిసర్కిల్ : దాడులు చేస్తే విధులు ఎలా నిర్వర్తిస్తామంటూ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు కడప ఆర్ఎం కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. దువ్వూరు వద్ద ఆళ్లగడ్డకు చెందిన ఓ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడడం తగదని నిరసన ప్రదర్శించారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. కెపాసిటీకి మించి బస్సులో ప్రయాణికులున్నా.. ఆపాలంటూ దాడులు చేయడం దారుణమన్నారు. స్టేజితో సంబంధం లేకుండా ఎక్కడపడితే అక్కడ బస్సు ఆపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రయాణికులను తీసుకువెళ్లేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులు రాక అసహనం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రవాణాశాఖ మంత్రి బస్సు డ్రైవర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి కల్పించుకుని డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో అందరూ వెనుదిరిగారు.

అద్దె బస్సు డ్రైవర్లపై దాడి సరికాదు



అద్దె బస్సు డ్రైవర్లపై దాడి చేయడం సరికాదు. ప్రయాణికులు కోరిన చోట బస్సు ఆపకపోవడంతో ఏకంగా దాడులు చేస్తున్నారు. తాము చెబుతున్న మాటలను పట్టించుకోకుండా దాడులు చేస్తే విధులు ఎలా నిర్వర్తించాలి. ఈ విషయంగా ఆర్టీసీ అధికారులు కూడా ప్రయాణికుల పక్షాన మాట్లాడటం ఆవేదనకు గురి చేస్తోంది.

- వెంకట్రామిరెడ్డి, తాడిపత్రి డిపో

కఠిన చర్యలు చేపట్టాలి



విధినిర్వహణలో ఉన్న తమపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి. సంస్థ పక్షాన పనిచేస్తున్న తమకు అధికారులు మద్దతు తెలియజేయాలి. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గత కొన్నిరోజులుగా క్రమం తప్పక డ్రైవర్లపై దాడులు జరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది.

- మహమ్మద్ రఫీ, డ్రైవర్, కడప డిపో